ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు


స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రెహమాన్‌ఖాన్

సుభాష్‌నగర్: చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్‌ఖాన్ హెచ్చరించారు. జగద్గిరిగుట్ట, మహాదేవపురం ఆనుకొని ఉన్న పరికి చెరువు ఎఫ్‌టీఎల్ సర్వే నెంబరు 348/1 పరిధిలో నిర్మాణాల విషయమై ఫిర్యాదు రావడంతో గురువారం తహసీల్దార్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం, సర్వేయర్ జ్యోతిలతో కలిసి చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరికి చెరువు 60 శాతం మేర కూకట్‌పల్లి పరిధిలోకి రాగా, నలభై శాతం మేర కుత్బుల్లాపూర్ మండల పరిధిలోకి వస్తుందన్నారు. ఇరిగేషన్ శాఖతో సంయుక్తంగా కలిసి సర్వే జరిపి హద్దురాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు రెహమాన్ ఖాన్ తెలిపారు. రెవెన్యూ అధికారులు చెరువు పరిసర ప్రాంతాల్లో పరిశీలనకు రావడంతో స్థానికంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాల చేపట్టిన వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి.

ముందస్తు పరీక్షలతో ప్రాణాలు నిలుస్తాయి


పరీక్షలకు హాజరైన మహిళలు

రంగారెడ్డినగర్: మహిళలు ఎక్కువగా కేన్సర్ల బారిన పడుతున్నారని, ముందస్తుగా వాటిని గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చని లయన్ ఎం.రమాదేవిరెడ్డి అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జె కేన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శ్‌నగర్ కమ్యూనిటీ హాలులో మహిళలకు గర్భాకోశ, రొమ్ము, నోటి కేన్సర్లకు సంబంధించి ముందస్తు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన ఈ శిబిరంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షుడు కె.జయరామ్, ఆదర్శ్‌నగర్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, క్యాంప్ చైర్‌పర్సన్ సత్యనారాయణ, క్యాంపు కో. చైర్‌పర్సన్ విజయ బాబు, లయన్స్‌క్లబ్ కుత్బుల్లాపూర్ ప్రెసిడెంట్ కట్టా కుమారి, సెక్రటరీ విశాల్, కోశాధికారి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి


ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న గణేశ్ ఉత్సవ కమిటీల సభ్యులు

నిజాంపేట్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంతరెడ్డి కోరారు. గురువారం బాచుపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మల్లంపేట్‌కు చెందిన శ్రీసాయి బాలాజీ ఎన్‌క్లేవ్ అసోసియేషన్, నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీకి చెందిన గణేష్ ఉత్సవ కమిటీ, సాయి అనురాగ్ కాలనీ సేవా సమితి సభ్యులు హన్మంతరెడ్డిని కలిసి ఉత్సవాల్లో పాల్గొల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ తొమ్మిదిరోజుల పాటు జరిగే గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, గణేశ్ మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు జీతయ్య ముదిరాజ్, రాంచందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు


నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణం

కుత్బుల్లాపూర్: నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నాడని ఆరోపిస్తూ కాసా ఉజ్జయిని అపార్ట్‌మెంట్‌వాసులు కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ పరిధిలోని జయభేరి పార్క్‌లో గత కొంతకాలంగా ఓ వ్యక్తి ఎటువంటి సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం చేపడుతున్న విషయంపై అధికారులకు ఫిర్యాదు చేస్తే కొన్ని రోజులు పనులు చేయకుండా ఉన్నాడని, తాజాగా ఎటువంటి నిబంధనలు పాటించకుండా యథావిధిగా నిర్మాణం చేపడుతున్నాడని అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘం ప్రతినిధి గాజుల నరసింహ పేర్కొన్నారు. ఇప్పటికే కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని నిర్మాణం ఆపకుంటే కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గతంలో ఈ నిర్మాణంపై జులై 22వ తేదీన ఫిర్యాదు చేయగా, ఆగస్టులో సైతం ఇదే విషయంపై అధికారులను కలిశామని స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదు విషయంపై కమిషనర్ శ్రీహరిని 'సాక్షి' వివరణ కోరగా.. సదరు నిర్మాణాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి రూ.25 వేలు అందజేస్తున్న చల్లా సుధీర్‌రెడ్డి

నిజాంపేట్: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ వ్యక్తికి శ్రీ పట్టాభి రామాంజనేయ దేవస్థానం చైర్మన్ చల్లా సుధీర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రగతినగర్‌కు చెందిన ధనుంజయ్ కుమారుడి ఆరోగ్య పరిస్థితి బాగలేకపోవడంతో వైద్యఖర్చుల నిమిత్తం ఆ కుటుంబ ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తోంది. ఈ విషయం గురించి తెలుసుకున్న సుధీర్‌రెడ్డి తనవంతు సహాయంగా గురువారం ధనుంజయ్ కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ధనుంజయ్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

సేల్స్‌మెన్ దృష్టిమరల్చి బంగారు ఆభరణాలు చోరీ

నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ ఏసీపీ హన్మంత్‌రావు

జగద్గిరిగుట్ట: బంగారం షాపులలో సేల్స్‌మెన్ దృష్టి మరల్చి బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న నలుగురు నిందితులను ఆదుపులోకి తీసుకున్న సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాలానగర్ ఏసీపి హన్మంత్ రావు, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్ వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా మధిరకు చెందిన ఆరుగురు బొజ్జగాని దీనమ్మ, బొజ్జగాని నాగేంద్రమ్మ, వెంకట రావమ్మ, బాలసాని అశోక్, బొజ్జగాని గ్యానమ్మ, బాలసాని వెంకటపతి ఓ బృందంగా ఏర్పడ్డారు. వీరు నగల షాపులకు కస్టమర్‌గా వెళ్లి అక్కడున్న బంగారం వస్తువులను చూసి సేల్‌మెన్ దృష్టిని మరల్చి అసలు నగలను రోల్డ్‌గోల్డ్ వస్తువులను మార్చి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో గత నెల 27వ తేదీన ఒకేరోజు 3 జ్యువలరీ షాపులలో దొంగతనం జరిగినట్లు కేసులు నమోదయ్యాయి. దీంతో జగద్గిరిగుట్ట పోలీసులు, సీసీఎస్ పోలీసులు, సైబరాబాద్ కమిషనరేట్ సంయుక్తంగా టీంలుగా ఏర్పడి ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. దీంతో చోరీలు జరిగిన ఆభరణాల షాపుల్లోని సీసీ ఫుటేజీల ఆధారంగా కేసును ఛేదించారు. ఈనెల 4వ తేదీన బొజ్జగాని దీనమ్మ, బొజ్జగాని నాగేంద్రమ్మ, వెంకట రవమ్మ, బాలసాని అశోక్ అరెస్టు చేశారు. మరో ఇద్దరు బొజ్జగాని గ్యానమ్మ, వాహన డ్రైవర్ బాలసాని వెంకటపతి పరారీలో ఉన్నారు. అదుపులోకి తీసుకున్న నలుగురిని తనదైన శైలిలో విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. మొత్తంగా వీరు 60 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు తేలింది. త్వరలోచే పరారైనా ఇద్దరిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి ఓ స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. అదుపులో ఉన్న నిందుతులపై పలు పోలీస్ స్టేషన్‌లలో పదుల సంఖ్యలో కేసులు ఉండడం విశేషం. బొజ్జగాని దీనమ్మపై 11, నాగేంద్రమ్మపై 12, వెంకట రవమ్మ పై 12 కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసును ఛేదించిన పోలీసులను బాలానగర్ ఏసీపి అభినందించారు.


కొంపల్లి శివశివానీ కళాశాలలో...


వెంకటేశ్వరనగర్ బీపీఎస్ ఒలంపియాడ్ స్కూల్‌లో...

గురు సాక్షాత్ పరబ్రహ్మ..!

ఉపాధ్యాయుల దినోత్సవాన్ని గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే గురువులను సత్కరించి తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గురువులు సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపులని అన్నారు. ఏ విద్యార్థి అయినా ఉన్నత స్థాయిలో నిలిచారంటే దానికి గురువే మొదటి కారణం అవుతాడని అన్నారు. -కుత్బుల్లాపూర్


సత్‌జ్ఞాన్ స్కూల్‌లో...


డీపోచంపల్లి ప్రభుత్వ పాఠశాలలో...


సుభాష్‌నగర్ వివేకానంద విద్యామందిర్ స్కూల్‌లో...


బోధి వృక్షా ఒలింపియాడ్ స్కూల్‌లో...


అవార్డు అందుకుంటున్న టీచర్ రమాదేవి..


అవార్డు అందుకుంటున్న పల్ల రఘుపతి


భౌరంపేట్‌లోని శిఖర స్కూల్‌లో...


జగద్గిరిగుట్ట సంస్కృతి పాఠశాలలో...


టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో...

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్: హెచ్‌ఎండీఏ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్‌జీ, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీనివాస లేక్‌వ్యూ, బాచుపల్లి పోలీస్ స్టేషన్, బాచుపల్లి గ్రామం, రైసినా బిల్డర్స్, మమత ఆస్పత్రి, శ్రీఖర విల్లాస్ నుంచి బాచుపల్లి సిగ్నల్స్ వరకు, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి మల్లంపేట్ ప్రధాన రోడ్డు, మా విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

కుత్బుల్లాపూర్‌లో...

కుత్బుల్లాపూర్: ఫీడర్ లైన్ల ఎక్స్‌టెన్షన్ పనుల కారణంగా శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 11 కేవీ మీనాక్షి, 11 కేవీ జీడిమెట్ల, 11 కేవీ రామరాజునగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలతోపాటు రామరాజునగర్, మీనాక్షి ఎన్‌క్లేవ్, జీడిమెట్ల గ్రామ ప్రధాన రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వ్యక్తి అదృశ్యం

కుత్బుల్లాపూర్: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది... పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొంపల్లి అశ్విని కాలనీకి చెందిన పోలేషక వెంకన్న(53) జులై 11వ తేదీన ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెంకన్న కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో గురువారం పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్‌లో మంటలు

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

సుభాష్‌నగర్: టిప్పర్‌లో చెత్తను ఖాళీ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన కైసర్ నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గండిమైసమ్మకు చెందిన టిప్పర్‌లో గురువారం తెల్లవారుజామున చెత్తను నింపుకొని దేవేందర్‌నగర్, కైసర్‌నగర్ ప్రధాన రోడ్డు పక్కన ఖాళీ చేసే క్రమంలో 11 కేవీ ప్రధాన విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో డ్రైవర్ హరిసింగ్‌కు తీవ్ర గాయాలు కాగా అతన్ని సూరారంలోని నారాయణ ఆసుపత్రికి తరలించారు. అగ్నికి టిప్పర్ సగం మేర కాలిపోయింది. స్థానికుల సమాచారం మేరకు విద్యుత్ అధికారులు కరెంట్ నిలిపివేశారు. జీడిమెట్ల ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

క్రీడలతో స్నేహపూరిత వాతావరణం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దుండిగల్ సీఐ సతీష్

దుండిగల్: క్రీడలతో యువకుల్లో స్నేహపూరిత వాతావరణం నెలకొంటుందని దుండిగల్ సీఐ పి.సతీష్ అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 12 జట్లు పాల్గొంటుడగా మొదటి రోజు రెండు జట్ల మధ్య పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, మేడ్చల్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి ఆదేశాల మేరకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని, మూడు రోజులపాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శంకర్, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాకారుల అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దుండిగల్: వర్షాకాలం నేపథ్యంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళాకారులు చైతన్య పరుస్తున్నారు. దీనిలో భాగంగానే దుండిగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ సాంస్కృతిక సారథి మేడ్చల్ జిల్లా కళాకారులు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలపై పాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టీం లీడర్ బాలు, శాంతి శోభ, రేణుక, సృజన్ కిషోర్, నరేష్, మున్సిపల్ మేనేజర్ ఎస్. సునంద, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి. సాత్విక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం


సమావేశంలో పాల్గొన్న ముద్దాపురం మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తూ ముందుకు సాగడమే తన ధ్యేయమని కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. కాజిపల్లి పారిశ్రామిక వార్డులోని లిఫార్మ లిమిటెడ్ కంపెనీలో నూతనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించగా గురువారం కుత్బుల్లాపూర్ నుంచి కార్మికులతో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, కాంగ్రెస్ నేత భరత్‌గౌడ్, కార్మిక నేత సాయన్న గౌడ్ తదితరులతో కలిసి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్ గౌడ్ మాట్లాడుతూ కార్మికులకు ఏ ఆపద వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

14న గణేష్ పెయింటింగ్ పోటీలు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గణేష్ పెయింటింగ్ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఫౌండర్, లయన్ సత్యవోలు రాంబాబు తెలిపారు. గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 14న వరల్డ్ రికార్డ్ బ్రేకింగ్ గణేశ్ పెయింటింగ్‌ను నిర్వహిస్తున్నామని, చిన్నారుల నుంచి పెద్దల వరకు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 108 నిముషాల్లో కాన్వాయ్‌పై గణేశుడిని చిత్రీకరించాల్సి ఉంటుందని, విశ్వగురు వరల్డ్ రికార్డ్ ప్రతినిధుల పర్యవేక్షణలో ఈ పోటీలు ఉంటాయన్నారు. బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన్ జ్యోతి స్కూల్‌లో ఉదయం 9 గంటలకు పెయింటింగ్ ప్రారంభమవుతుందని రాంబాబు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలిచే వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 85018 00947, 98494 90663, 9959971679 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

టైలరింగ్ సెంటర్‌లో టీచర్స్‌డే



చింతల్: లార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న చింతల్‌లోని టైలరింగ్ సెంటర్‌లో గురువారం టీచర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సెంటర్ టీచర్ సాయి లక్ష్మి మాట్లాడుతూ ప్రతి బ్యాచ్‌లో 25 మందికి టైలరింగ్‌లో ట్రైనింగ్ ఇస్తున్నామని, అంతే కాకుండా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్ల అందజేసి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తునామని తెలిపారు. లార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సాయిలక్ష్మి కోరారు.

గుంతల రోడ్లతో గుబులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ రాజీవ్‌గృహకల్పలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లపై భారీ గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై గుంతల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో స్థానికంగా దోమల ఉధృతి పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. ఈ సందర్భంగా సీపీఎం రాజీవ్ గృహకల్ప శాఖ కార్యదర్శి బాలపీరు మాట్లాడుతూ రోజువారి చెత్తను తరలించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది ఆ దిశగా పనిచేయకపోవడంతో చెత్త కుప్పలు పేరుకపోతున్నాయని అన్నారు. చెత్త కుప్పల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వెంటనే ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని కోరారు. అదే విధంగా అధ్వానంగా మారిన రోడ్లను బాగు చేయకుంటే కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రత్యేక పూజలు



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మైసమ్మనగర్ బీ బ్లాక్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన జరిగి 41 రోజులు కావడంతో స్థానిక భక్తులు మండల పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృత అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

దుండిగల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బౌరంపేట గ్రామం నుంచి శంభీపూర్ వైపు వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడి అధ్వాన స్థితికి చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. రూ.2 లక్షలు తన సొంత ఖర్చులతో బౌరంపేట ప్రధాన రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రోడ్డు పనులను బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు.

కోదండరాంకు శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్: ఎమ్మెల్సీ కోదండరాం జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలో జరిగిన కార్యక్రమానికి తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, నాల్గో తరగతి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ తదితరులు ఆయనను కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి గల్లంతు


షబ్బీర్..(ఫైల్)

కుత్బుల్లాపూర్: ఫాక్స్‌సాగర్ చెరువులో పడి వ్యక్తి గల్లంతైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువులో చేపలు పట్టేందుకు బుధవారం సాయంత్రం ముగ్గురు వ్యక్తులు వెళ్లారు. రోడామేస్త్రీనగర్ చెందిన షబ్బీర్ చేపలు పడుతూ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. దీంతో భయాందోళనకు గురైన మిగతా ఇద్దరు స్నేహితులు అక్కడి నుంచి వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రాత్రి గాలించడం వీలుకాకపోవడంతో ఫాక్స్‌సాగర్ చెరువులో గురువారం ఉదయం బోటు సహాయంతో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ రెహమాన్‌ఖాన్ నేతృత్వంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం షబ్బీర్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. షబ్బీర్ జీడిమెట్ల ప్రాంతంలో ఫాబ్రికేటర్‌గా పనిచేస్తుంటాడని, అతనికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారని బంధువులు తెలిపారు. అయితే చీకటి పడటంతో శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పేట్‌బషీరాబాద్ పోలీసులు పేర్కొన్నారు.